
# ఎండమావులు

మంథా వెంకటరమణారావు



**ఏదో ఉద్వేగం చెంది, దేనికోసమో బాధపడి, ఏవో నిజాలు గ్రహించి, అవన్నీ రచనలద్వారా అందజేసి, ప్రపంచానికి ఉపయోగపడుతున్నాం అనుకుంటారు రచయితలు. ఎవడిక్కావాలి ఈ కాగితాలకట్టలు? ఎవడు చదువుతాడు?-అని ఆలోచించరు, పాపం!**

శవానికి నిప్పు పెట్టేటప్పటికి రాత్రి ఎనిమిదైంది. ఏర్పాట్లు చెయ్యడమే బ్రహ్మాండమైంది. తీరా అంటుకున్నాక చిన్న చినుకు పట్టుకుంది. సగం కాలేక, చినుకులు పెద్దవయేయి.

కృష్ణమూర్తి అన్నాడు: "రేపు సమావేశానికి టౌన్‌హాల్ ఏర్పాటు చెయ్యి."

"సరే. కాని ఆట్టేమంది వస్తారని తోచదు."

"అందరం ఒకచోట కలిసి అతని ఆత్మకి శాంతిని కోరడం మన కనీసధర్మం" అన్నాడు కృష్ణమూర్తి.

000

ఎండ చల్లపడ్డది. ఎంతో శ్రమతో మోసుకొచ్చి 'లాన్'లో కుర్చీలు వేసేడు గోపీ. చెల్లెలు లక్ష్మి రబ్బరుగొట్టంతో చెట్లకు నీళ్లు పడుతూంది.

"తాతా! కుర్చీలు వేసేను" అన్నాడు గోపీ.

"వాళ్లొస్తున్నారేమో చూడు బాబూ!"

గోపీ ఇటూ అటూ చూసి, "ఇంకా రాలేదు తాతా!" అన్నాడు.

ముసలాయనొచ్చి వాలుకుర్చీలో కూచున్నాడు. పొడుగాటి గడ్డం, మీసాలు, జుత్తు భుజాలమీదకి వ్రేలాడుతూంది. పొట్టిగా వున్నాడు. ముఖం ముడుతలు పడింది. ముఖాన చారెడు కుంకుమబొట్టు.

"మీ నాన్న ఏంజేస్తున్నాడ్రా?" ముసలాయన అడిగేడు.

"కాఫీ తాగుతున్నారు, ఏం కావాలి?" ఇంట్లో నుండి స్త్రీ కంఠం ప్రశ్నించింది. ఆ ప్రశ్నలో మృదుత్వమూ లేదు; బింకమూ లేదు.

"వేళ అయింది కదా అని. అంతే."

లోనుండి జవాబు రాలేదు.

"తాతా! ఏం పుస్తకం తెమ్మంటావివాళ?"

తాతగారు ఆలోచించేరు. "ఇవాళెవరో ఆధునికుడొస్తాట్ట!" 'ఆధునికుడు' అన్నప్పుడు అతడి పెదవులు చిరునవ్వు చిందేయి.

"అన్ని పుస్తకాలెలా రాసేవ్ తాతా నువ్వు? పాఠం ఒక పేజీ రాసేసరికే నాకోరోజు పడుతుంది!"

ముసలాయన ఫకాల్న నవ్వేడు. దగ్గుతెర ముంచుకొచ్చింది.

"మంచినీళ్లు తెచ్చేదా?"

వద్దన్నట్టు తల ఊచేడు ముసలాయన. దగ్గు తగ్గింది.

"నిన్న కావిడిపెట్టె మూత తీసేసరికి రెండు పెద్ద ఎలుకలు పైకి గెంతేయి, తాతా! ఆ పుస్తకాలు కొరికేసివుంటాయని అమ్మ అంది."

ముసలాయన ముఖం ఆందోళన వ్యక్తపరిచింది.

"రేపు నువ్వూ, అమ్మా వాటిని బయటికి తియ్యండి చూదాం. నాకోపిక లేదు. నువు పెద్దవాడివై పెద్ద చదువు చదివేక, వాటి విలువ నీకు తెలుస్తుందిరా గోపీ... తాతే రాసేడా ఈ పుస్తకాలు? అని ఆశ్చర్యపోతావు."

"చీపురు పట్టుక వాటిని వెంటబెట్టేనులే. అవి మరి రావు!" అన్నాడు గోపీ ధీమాగా.

లక్ష్మి, తాతమీదా, అన్నమీదా నీళ్లు చిమ్మి, పొరపాటున జరిగినట్టు బుద్ధిగా ముఖం పెట్టి మళ్లీ చెట్లకు నీళ్లు పడుతూంది.

"పన్నీరుజల్లురా! దీన్నెవడు పెళ్లి చేసుకుంటాడోకాని వాడు అదృష్టవంతుడు" అన్నాడు ముసలాయన నవ్వుతూ.

"ఏ పుస్తకం కావాలో చెప్పేవ్ కావ్!"

"ఆ పుస్తకం తే!"

గోపీకి అర్థమైంది, ఏ పుస్తకమో!

000

"అతను పడ్డ బాధ నేను చూడలేకపోయాను. 'ఆక్సిజన్ మాస్కు' పెట్టీక కాస్త తెరిపి ఇచ్చింది" అన్నాడు కృష్ణమూర్తి.

"బాధపడకుండా చావడం ఒక పుణ్యవిశేషం. కొందరు అలా మాట్లాడుతూనే ప్రాణం వదిలేస్తారు."

వర్షం తగ్గింది. మంట ఎత్తుగా లేచింది.

ప్రసాదరావు దగ్గరికొచ్చి అన్నాడు: "ఇంక బాధలేదు. వర్షం ఎత్తిపెట్టేసినట్టే."

పెద్దకొడుకు వెంకట్రావు దూరంగా కూచున్నాడు ముఖం పరోక్షంగా పెట్టి-నిప్పు అంటించేసిక ఇటు చూడకూడదు కనక. శవం కాలిపోయేక అందరూ లారీలో పోవాలి. ఐదుమైళ్ల దూరం వుంది ఇల్లు.

కృష్ణమూర్తి విచారంగా అన్నాడు, చీకట్లోకి చూస్తూ-"ఏవిటో మన బతుకులు! ముఖ్యంగా ఈ రచయితలు ఏదో ఉద్వేగం పొందటం-దేనికనో బాధపడటం-జీవితాన్ని తరిచి ఏవో నిజాల్ని గ్రహించి అవన్నీ తన రచనలలో పెట్టి జీవితమంతా ఈ ప్రపంచానికి ఏదోవిధంగా ఉపయోగపడుతున్నాం అనుకోవడం-ఓసారి చదివి మన్నాటికి మరిచిపోతుంది ప్రజ. ఎవడో ఉద్దండుడనిపిస్తే అతనిమీద ఓ వ్యాసం. దానితో అతడి చరిత్ర ముగుస్తుంది."

"కట్టిపెట్టవోయ్ నీ వేదాంతం!" అన్నాడు ప్రసాదరావు.

000

"తాతా! వాళ్లు వస్తున్నారు" గోపీ పరుగెత్తుకవచ్చి చెప్పేడు.

ముసలాయన సర్దుకున్నాడు.

కృష్ణమూర్తి, అప్పారావు, ప్రసాదరావు వచ్చేరు. వారితో ఉన్నాడొక యువకుడు. అతనికి పాతికేళ్లుంటాయి. కళ్లీ లాల్చీ, షరాయి, రేగినజుత్తు. లంఖణాలు చేసినవాడిలా లోనికిపోయిన బుగ్గలు. చురుకైన కళ్లు. చూడగానే రచయిత ఇతను అని తెలుస్తుంది.

కృష్ణమూర్తి కవి. అప్పారావుకు సారస్వతం అంటే అభిలాష వుంది. ప్రసాదరావు నటుడు. వీరు ముగ్గురూ మధ్యవయస్కులు. రోజూ ఇక్కడ కలుస్తారు.

వెంకట్రావు లోనుండి వచ్చేడు. "వచ్చేసేరూ? ఇవాళ ఆలస్యం చేసేరు. ఓహో! సుబ్బారావుగార్ని కూడా లాక్కొచ్చేరే!" అన్నాడు వెంకట్రావు.

"ఈయన్ని తీసుకొస్తానని బాబుగారితో నిన్న చెప్పేను. బాబుగారికి పరిచయం చేదామని"-ముసలాయన్ను ఉద్దేశించి -"బాబుగారూ! ఈయనే, నేను మీకు చెప్పిన సుబ్బారావుగారు. ఇప్పుడు బాగా ప్రచారంలో వున్న రచయిత. ముందుకు రావాల్సిన యువకుడు" అన్నాడు.

"నమస్కారమండీ! తమవంటి వారి పరిచయం అవడం నా అదృష్టం!" అన్నాడు సుబ్బారావు.

"నూరేళ్లు హాయిగా బతుకు నాయనా! కూచోండి. నిల్చుండిపోయారేం?" అన్నాడు ముసలాయన. కూర్చున్నారు.

"తమరి రచనలు చదివే భాగ్యం నాకు కలగలేదు. ఆ పుస్తకాలిప్పుడు దొరకడం లేదు. ఐదేళ్ల క్రితం అనుకుంటాను, ఒక పత్రికలో మీ పుస్తకం ఒకదానిమీద సమీక్ష చూసేను" అన్నాడు సుబ్బారావు.

ముసలాయన అందుకున్నాడు. "నాకు ఓపిక సన్నగిల్లింది. ఇవాళో రేపో అన్నట్టుంది నా బతుకు. అన్నీ మూలపారేశాను. అవి మళ్లీ అచ్చుకివ్వాలని కూడా నాకు కోరిక లేదు. వాటి విలువ వాటికుంది. ఇప్పుడంతా వాస్తవికసాహిత్యమనీ, పిల్లల సాహిత్యమనీ, డిటెక్టివ్ సాహిత్యమనీ, గ్రామస్థుల సాహిత్యమనీ, కాలేజీ యువతీయువకుల సాహిత్యమనీ ఏవేవో రకరకాలు ప్రచారంలో వున్నాయి. కలం పట్టగలిగిన ప్రతివాడూ రచయితే. నాలుగు కాగితాలున్న ప్రతిదీ పత్రికే. మనుష్యులకు తమంతట తాము ఆలోచించే శక్తీ, ఓపిగ్గా చదివేశక్తీ చచ్చిపోతున్నాయి. చవకబారు ఆకర్షణ, ఆనందం, ఉద్రేకం కావాలి. మన ఈ పంచవర్షప్రణాళికలు మనుష్యులను పూర్తిగా వాస్తవికవాదులుగా మార్చేస్తున్నాయి. కవిత చచ్చిపోతూవుంది. దాన్ని చూసే నాథుడు లేడు. మనుష్యులలోని రసజ్ఞత, గంభీర, ఉన్నత, భావవైశాల్యం తగ్గుముఖం పట్టాయి. అమెరికా స్థితి చూడండి. భౌతికంగా ఉన్నతస్థితికొచ్చినా నైతికంగా దిగజారిపోతూంది."

లక్ష్మి చెట్లకు నీళ్లు పొయ్యడం పూర్తి చేసి, తాత దగ్గరికొచ్చి తల నిమిరింది. ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని, ఒళ్లో కూచోబెట్టుకున్నాడు ముసలాయన.

"తమరు మరోలా అనుకోకపోతే ఒకమాట చెప్తాను. మార్పు అన్నది ప్రతి రంగంలోనూ వుంది. తమరు సారస్వతపు విలువలు తగ్గిపోతున్నాయన్నారు. సారస్వతం ప్రయోజనం ప్రజలకు ఉపయోగపడడం. ఈ నాటి ప్రజల దృక్పథంలో వచ్చిన మార్పువల్లనే సాహిత్యంలో కూడా మార్పు వచ్చింది. భారత, భాగవతాలూ గట్రా ఎంతమంది చదువుతున్నారు?" అన్నాడు సుబ్బారావు.

వాదప్రతివాదాలు జోరుగా సాగుతున్నాయి.

చల్లగా గాలి వీస్తూంది. ఇవాళ పున్నమి చంద్రుడప్పుడే ఉదయించాడు. కొంగలు బారులుకట్టి పోతున్నాయి. వాటి రెక్కల కదలిక నడి చెవులకు హాయిగా వుంది.

తాతగారి ఒళ్లోంచి లేచింది లక్ష్మి. గెంతి, గోపీ చెయ్యి పట్టుకులాగి కొంగల్ని పిలుస్తూ అంది: "కొంకొంగోళ్లు... నీ చేతివేళ్లు... నా చేతిరాళ్లు ..."

"ఒక ప్రఖ్యాత ఆంగ్లవారపత్రిక ఇతని కథను తర్జుమా చేసి, ఈ వారం ప్రకటించింది" అప్పారావు అన్నాడు.

"మంచిది నాయనా, మంచిది. రాయి, రాయి. కాని, నాకీనాటి రచయితలలో నమ్మకం

ఈ కథను ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 7.3.1962 సంచికలో ప్రచురించాము



## కొత్త హీరోయిన్ కావాలి!

హీరోయిన్ల వేటలో చెయ్యి తిరిగిన దర్శకుడు ఇ.వి.వి.సత్యనారాయణ. ఆయన ప్రతిచిత్రంలోనూ కొత్త హీరోయిన్ వుండాలని కోరుకుంటారు. తెలుగు పరిశ్రమకు ఆమని, రంభ, రవళి, ఊహ, స్నేహ, రచన, మాళవిక తదితరనాయికలను ఆయనే పరిచయం చేశారు. పరిచయం చేశాక, ఆమె కెరీర్‌ను ఒక పొజిషన్‌కు తెచ్చాక మరో హీరోయిన్ కోసం వెతుకుతారు ఇ.వి.వి. 'హీరో ఎవరైనా జనం చూస్తారు. హీరోయినే కదా ఆడియన్స్‌ను ఆకర్షించేది! అందుకని జనాకర్షణ కోసం కొత్తకొత్త హీరోయిన్లుండాలని నా అభిమతం. తెలుగులో హీరోయిన్‌గా నటించేందుకు ఎక్కువగా అమ్మాయిలు ముందుకు రావటం లేదు కానీ, ఇదే ముంబయిలోనైతేనా, మాటంటే వందమంది అమ్మాయిలు క్యూలో నిలబడతారు" అంటున్నారు ఇ.వి.వి. కానీ ముంబయికి పోకుండా ఈస్ట్ గోదావరిజిల్లాపై దృష్టి సారిస్తే అక్కడింకో జయప్రద దొరికితీరుతుందని కొందరంటున్నారు. మరి ఇ.వి.వి. ఏమంటారో?

ఎస్.

కుదరకుండా వుంది. ఈ రచనలన్నీ ఎంతకాలం నిలుస్తాయి? ఈ నాటి పత్రికలలోని రచనలు వచ్చేవారం పత్రిక వచ్చేసరికల్లా మాసిపోతున్నాయి. దినపత్రికలోని వార్తలెంత అశాశ్వతమో, ఈ రచనలూ అంత అశాశ్వతంగానే వుంటున్నాయి. ఇదొక స్థితి. ఇది కొంతకాలం నడుస్తుంది. ఆనక మళ్లీ పొరపాటు గ్రహిస్తారు. నాయనా, గోపీ! ఆ పుస్తకం ఓసారి తీసుకురా బాబూ!" అని కేకవేశారు ముసలాయన.

"అలాగే తాతా!"

అది ఏ పుస్తకమో సుబ్బారావుకు తప్ప అందరికీ తెలుసు. అందులోని ప్రతి అధ్యాయమూ తెలును.

"ఏవండీ! ఇలా వచ్చి ఈ కాఫీ పట్టుకెళ్లండి!" లోనుండి స్త్రీ గొంతు.

వెంకట్రావు లేచి లోనికి వెళ్లాడు.

**000**

వెంకట్రావు ఇసుకలో చతికిలబడి ఏడుస్తున్నాడు. ఏదో తనలో తాను గొణుక్కుంటున్నాడు.

అప్పారావు, వెంకట్రావు భుజం మీద చెయ్యివేసి, "వెంకటీ! ఒకమాట చెప్తాను విను. రచయిత అన్న తరువాత, అతణ్ని విమర్శించటానికి అందరికీ హక్కుంది. అందువల్ల ఆ రచనకు ఉన్న విలువ తగ్గదు, లేని విలువ రాదు. బాబుగారు గొప్పమనిషి. ఆయన హృదయం సువిశాలం. అతని రచనలూ అంత విశాలమైనవీను. అవి అర్థం చేసుకోలేకపోవడం మన ఈనాటి దౌర్భాగ్యస్థితిని చాటుతుంది. పొరపాట్లు ఇందులో నీ తప్పు ఏమీ లేదు. పొరపాట్లు జరుగుతూవుంటాయి."

"పైడయ్యా! ఆ దుక్క మీదకు ఎగదొయ్యి!" ప్రసాదరావు చాకలి పైడయ్యను కేకవేసేడు.

నిప్పుకణాలు గాలిలో అంత ఎత్తున రేగేయి. దూరాన ఎవడో పిల్లనగ్రోవి వాయిస్తున్నాడు.

"మరో అరగంటకల్లా పూర్తిగా కాలిపోతుంది. ఈలోగా మనం ఏట్లో స్నానం చేసివద్దాం. పెట్రొమాక్సుకి గాలి కొట్టవోయి కృష్ణుడూ!" ప్రసాదరావు ఫర్మానాలిస్తున్నాడు.

చేతనున్న టార్చిలైటు నాలుగుమూలలా వేసేడు ప్రసాదరావు. రెండు కళ్లు జిగేలుమన్నాయి.

"వెధవనక్కలు! అప్పుడే వచ్చేసేయి" గొణిగాడు ప్రసాదరావు.

**000**

గోపీ ఇంకా 'ఆ' పుస్తకం పట్టుకరాలేదు.

ముసలాయన అంటున్నాడు: "నేను ఎన్నో రచనలు చేసేను. కొన్నిటికి విలువ ఇప్పటికీ వుంది. ఎప్పటికీ వుంటుంది. కొన్నిటి విలువ ఆనాడే పోయింది. విమర్శకు లోకనాడు ఆకాశానికెత్తేవారు. మర్నాడే దించేసేవారు. విమర్శకుల మాటలను నేను ఏనాడూ లక్ష్యపెట్టలేదు. నాకు ఆత్మీయులు, నా దగ్గరిమిత్రులు నా రచనల కిచ్చే విలువే నాకు పదివేలు. అది అలా ఉంచండి. ఇప్పుడు గోపీ తేబోయే పుస్తకం అముద్రితం. ఇది పూర్తి చేసేందుకు నాకు ఐదేళ్లు పట్టింది. దాదాపు వెయ్యిపేజీల వరకూ వుంటుంది ముద్రిస్తే. నా బతుకులో నేను గ్రహించిన అనుభవం, నిజానిజాలు, వ్యక్తుల విలువలు, వారి మానసికపరివర్తన ఈ గ్రంథంలో ప్రతిబింబిస్తాయి."


దగ్గుతెర అడ్డొచ్చింది. తేరుకొని అన్నడాయన: "దేవుడిలో నాకు నమ్మకముంది. నాకీ జీవితం ప్రసాదించినందుకూ, మనుష్యులనూ, పరిస్థితులనూ అర్థం చేసుకొని ఉద్వేగం పొంది ఈ రచనలు చెయ్యగలిగేశక్తి నాకిచ్చినందుకు నేను అతనికెప్పుడూ కృతజ్ఞుణ్ని. ఈ పుస్తకంలో ప్రత్యేకంగా ఒక అధ్యాయం వుంది. అది మీరు వినండి: నే చదువుతాను. విని మీ అభిప్రాయం చెప్పండి." ముసలాయన ఉద్రిక్తుడవుతున్నాడు. అతడి కళ్లు వెన్నెలవెలుగులో మెరుస్తూ కనిపిస్తున్నాయి.

"గోపీ! ఆ పుస్తకం తే నాయనా! ఏం చేస్తున్నావింతవరకూ?" ముసలాయన కేక వేసేడు.

ఇంట్లో భార్యాభర్తలేవో కీచులాడుకుంటున్నారు.

"తెస్తాడు. తొందరేముంది? తమరు

### సరికొత్త సెక్స్‌బాంబు!



మహేశ్‌మాంజ్రేకర్ చిత్రం 'కురుక్షేత్ర'లో "ఘూఘురా..." అంటూ నాట్యం చేసి ప్రేక్షకులను ఉర్రూతలూగించిన నటి సుమన్‌రంగనాథన్‌ను సరికొత్త సెక్స్‌బాంబ్‌గా చెప్పుకుంటున్నారు. తనను గురించి అలా జనం అనుకుంటే తనకేమీ అభ్యంతరం లేదంటూంది సుమన్. "నా ఆలోచనలెప్పుడూ పాజిటివ్‌గానే వుంటాయి. నేటి చాలామంది హీరోయిన్లకు నాకు వచ్చినన్ని అవకాశాలు కూడా రాలేదు. అందువల్ల ఈ సెక్స్‌బాంబ్ బిరుదు నాకేమీ ఇబ్బంది కలిగించడం లేదు. కొందరు హీరోయిన్లు నాకన్నా ముందున్నారని కూడా నాకు బెంగలేదు. ఎందుకంటే ఓ ద్వారం మూసుకుపోతే మరో ద్వారం తెరిచివుంటుందనే సూక్తి మీద నాకు నమ్మకం వుంది. నాకు అవకాశమొచ్చినప్పుడు నేనూ చచ్చునటినేమీ కానని నిరూపించుకుంటాను. నా కృషీ, శ్రమా ఫలించితీరుతాయి!" అంటూంది ధీమాగా. ఆత్మవిశ్వాసం వుండటం ఎవరికైనా అవసరమే మరి!

ఎస్.

అనుమతిస్తే, ఆ పుస్తకం తీసుకువెళ్లి పూర్తిగా చదివి, వారం రోజులలో మీకు తెచ్చి అప్పగిస్తాను" అన్నాడు సుబ్బారావు.

ముసలాయన సంతోషం పట్టలేక అన్నాడు: "తప్పకుండా తీసుకువెళ్లండి. నేను చచ్చిపోయినా, నా యీ రచన చావదు. అది ఎప్పటికీ నిలిచేవుంటుంది. మా గోపీ పెద్దవాడై దాన్ని అచ్చు వేయిస్తాడు"-ముసలాయన నవ్వేడు.

"అప్పటికి మనుష్యులలోనూ మార్పొస్తుంది లెండి."

ముసలాయన ఇక ఉండబట్టలేక-"నే తెస్తానుండండి పుస్తకం. ఈ కుర్రకుంక ఏమైపోయేడో!" అంటూ లేచేడు.

"కూచుందురూ... అతనితో మాట్లాడుతూ వుండండి" అంటూ, వినకుండా ముసలాయన లోనికి వెళ్లాడు, మెల్లిగా అడుగులు వేసుకుంటూ.

ఇంక ఎంతోకాలం బతకడనిపించింది కృష్ణమూర్తికి, ఆ రాత్రి అతన్ని చూడగా.

లోన చాలా గొడవ జరుగుతూంది. గోపీ ఒక మూల కూచొని ఏడుస్తున్నాడు. కాలిబొటనవేలుకు కట్టుకట్టివుంది.

వెంకట్రావు అంటున్నాడు: "ఉస్! మెల్లిగా మాటాడు-అందరూ వింటారు!"

ఆమె అందుకుంది. "వింటే విననీండి, ఏం, నాకేం భయమా? వాడికి పురమాయించడమెందుకూ ఈ పనులన్నీ? ఒకనాడా, రెణ్నాళ్లా? నిత్యమూ ఇదే సొద! కావిడిపెట్టి కప్పు కాస్తా పడి వేలు తెగింది. ఒక్కగానొక్క మగనలుసు. నా బాబు ప్రాణం ఎంతగా కటకటలాడిపోయింది! ఇంతకూ ఏం కొంప మునిగిందని అంతోటి గ్రంథాన్ని తెమ్మన్నారు? మా తాతలనాడు నేతులు తాగేం, మా మూతులు వాసన చూడండి అని. ఎవడికండీ కావాలి ఈ కాయితాల కట్టలు? ఎవడు చదువుతాడు? మీకు పని లేకపోతే సరా? మీరే అంటారు, నాటి కాలం అయిపోయిందని. అయినా ముసలాయన్ని తృప్తి పరచడానికీ నాటకం ఎంతకాలం ఆడతారు? రేపే ఇవన్నీ తీసి పొయ్యిలో పడేస్తాను! నా కొడుకుకన్న నాకివేం ఎక్కువ కావు!"

"మెల్లిగా మాటాడు. అతనికి వినిపిస్తుంది. చూడు, లలితా, బతికినంతకాలం అతను బతకడు. ఒకప్పుడు దేశమంతా అతని పేరు మారుమోగిపోయింది. ఈ నాడతని రచనల స్థితి ఇలావుంది. వాటికింకా విలువ వుందని అతను తృప్తిపడుతున్నప్పుడు మనం ఎందుకు కాదనాలి? ఊరుకో! బావుండదు!"

## నేనిప్పటికీ యౌవనవతినే!

అంటూంది మేడమ్ రేఖ. వయస్సు మీద పడుతున్నకొద్దీ రేఖకు సౌందర్యం పెరిగిపోతూందేమో అనిపిస్తుంది జనానికి. కొందరు గతజన్మలో పొరపాటునేమైనా అమృత సేవనం చేసి వచ్చిందేమో అని కూడా అనుకుంటున్నారు. అందుకే 'ఖిలాడియోం కా ఖిలాడీ' చిత్రంలో అక్షయ్‌కుమార్‌తో ఓ పాట సీనులో నటించింది రేఖ. ఇక 'బులందీ' చిత్రంలో కూడా అనిల్‌కపూర్‌తో ఓ పాటలో నటించింది. ఇక 'జుబైదా'లో మనోజ్‌బాజ్‌పాయి సరసన అతని భార్యగా చేసింది. 'లజ్జా'లో కూడా అందరికంటే ముందుందిట నటనాపటిమలో. మరందుకే రేఖ "నేనిప్పటికీ యౌవనవతినే!" అనుకోవటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

ఎస్.



వెంకట్రావు బయటకు వచ్చేందుకు వెనుదిరిగి గతుక్కుమన్నాడు. ఎదురుగా తన తండ్రి! భార్యాభర్తలు శిలల్లా అయిపోయేరు.

ముసలాయన తమాయించుకుని గద్గదకంఠంతో అన్నాడు: "నా గురించి ఆందోళన పడకండి బాబూ! మీ బతుకులు మీరు సుఖంగా బతకండి. కుర్రకుంకను పంపడం నాదే పొరపాటు. బాబూ గోపీ! దెబ్బ తగిలిందా? ఏదీ చూడనీ! పెద్ద దెబ్బే తగిలిందిరా చిట్టితండ్రీ! నాకన్నా తగిలింది కాదాదెబ్బ!" మనవణ్ని గుండెలకు హత్తుకున్నాడు ముసలాయన.

కొన్ని నిమిషాల తర్వాత, ముసలాయన తుఫాను దెబ్బకు దెబ్బతిన్న చెట్టులా అయి, వచ్చి కుర్చీలో కూలబడ్డాడు. అతడి కళ్లు ఎటో చూస్తున్నాయి. లోనికి వెళ్లినప్పుడు అతడిలో వున్న ఉత్సాహమూ, శక్తీ ఉడిగిపోయేయి. మనస్సే పెకలించబడ్డ మనిషిలా వున్నాడు.

'ఏమిటైందితనికి?' అనుకున్నాడు కృష్ణమూర్తి.

"బాబుగారూ, ఒంట్లో బావుండలేదా? నే తెస్తానన్నారు పుస్తకం?" అన్నాడు అప్పారావు.

"ఏం లేదు. మొహం కాస్త తిప్పినట్టయింది. ఇవాళో రేపో అన్నట్టుంది నా బతుకు. పుస్తకం రేపు పంపుతాలే నాయనా!"

సుబ్బారావు విస్తుపోయి చూస్తున్నాడు.

అనంతమైన ఆకాశంలోకి చూస్తూ ముసలాయన అన్నాడు: "మా కాలం వెళ్లిపోయింది. అయినా మాలోని అహం అణుచుకోలేక ఏవో కబుర్లు చెపుతూవుంటాం. బాధ్యతంతా మీవంటి రచయితలమీద వుంది. చెయ్యండి బాబూ, రచనలు చెయ్యండి! ఈ మధ్యను మంచి మంచిరచనలే వస్తున్నాయి... లేకపోలేదు." కొద్దిసేపు ఊరుకొని అన్నాడు: "ఆ ఆంగ్లపత్రిక పంపండి. మీ కథ చదువుతాను."

చంద్రుడు బాగా మీదకొచ్చేడు. పూలవానలా వెన్నెల కురుస్తూంది. తోటలోని మల్లెలు వాసనలు గుబాళిస్తున్నాయి...

000

"నాన్నా! నన్ను క్షమించు నాన్నా!" అని బావురుమన్నాడు వెంకట్రావు. చేతులతో తల బాదుకుంటున్నాడు.

ప్రసాదరావు, కృష్ణమూర్తి, చెరి ఒక రెక్కా పుచ్చుకొని అతణ్ని లారీవేపు తీసుకుపోతున్నారు.

ఇది వరకు మంట మండినచోట ఇప్పుడు నిప్పులు మాత్రం కణకణలాడుతున్నాయి.

మనుష్యసంచారం లేకపోగానే అక్కడ నక్కలు కూతపెట్టసాగేయి.

నక్షత్రాలు మెరుస్తూనేవున్నాయి. ఏరు పారుతూనేవుంది. చల్లనిగాలి వీస్తూనేవుంది. వెంకట్రావు ఏడుస్తూనేవున్నాడు.

ఇవాళ అమావాస్య. అంతటా చిట్టచీకటి!

●